సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 19 : జూలై : 2024



బడికెళ్లినా బతికేవారేమో..

దమ్మపేట మండలం జమేదార్‌బంజరలో పిడుగుపాటుతో ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మృతితో రోదనలు మిన్నంటాయి. 8లో



పోడు హక్కు పత్రాలు ఇవ్వాలి

పోడు భూముల సాగు చేస్తున్న పేదలందరికీ హక్కు పత్రాలివ్వాలని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. 8లో

క్షణక్షణం.. ఉత్కంఠ

ఏటా గోదావరి వరదలను మోసుకొస్తే ఈసారి అందుకు భిన్నంగా అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగులో వరద పోటెత్తింది. మునుపెన్నడూ జరగని విధంగా ఈ వరద నీటిలో 28 మంది చిక్కుకుపోయారు. బాధితులను కాపాడేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తక్షణమే స్పందించారు. అలాగే, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఆపై మంత్రి పొంగులేటి పెద్దవాగు ఘటన తెలియగానే ఆ ప్రాంతం ఏపీకి సమీపాన ఉండడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో మాట్లాడారు. ఆపై బాధితులను రక్షించేందుకు రెండు హెలికాప్టర్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం 6–15 గంటలకు ఘటనాస్థలికి చేరుకున్న హెలికాప్టర్లు బాధితులందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. దీంతో గంటల తరబడి 28మంది బాధితుల ఆందోళన.. వారి కుటుంబాల్లో ఉత్కంఠకు తెరపడింది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్

ఒక్కసారిగా పెరిగిన పెద్దవాగు ప్రవాహం

- వరద నీటిలో చిక్కుకున్న 28 మంది
- హెలికాప్టర్ల ద్వారా రక్షించిన ప్రభుత్వం
- తక్షణమే స్పందించిన మంత్రులు పొంగులేటి, తుమ్మల
- పర్యవేక్షించిన జారే, జిల్లా అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

అంతా ఇక్కడే..

పెద్దవాగు వరదలో 28మంది చిక్కుకుపోయారనే సమాచారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ విషయం బయటకు రాగానే హైదరాబాద్‌లో ఉన్న మంత్రులు స్పందించి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో రుణమాఫీ సంబురాల్లో పాల్గొంటున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లెందు మండలం సుదిమళ్లలో ఉన్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు తోడు ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ చేరుకున్నారు. అంతేకాకుండా ఏపీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, స్థానిక డీఎస్పీ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో సహాయక చర్యలు చేపట్టారు.

తెరుచుకోని గేట్లు

అశ్వారావుపేట మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్టు నిండిపోయింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు మూడు గేట్లు తెరిచి వరద నీటిని దిగువకు వదిలేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే మూడో గేటు తెరుచుకోవడానికి పది నిమిషాలు మొరాయించింది. దీంతో ఎగువ నుంచి వచ్చిన వరద ఎదురుపోటు వేయడంతోనే ఉధృతి పెరిగినట్లు చెబుతున్నారు.



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్

40ఏళ్లలో ఇలా ఎన్నడూ జరుగలేదు..

1981లో పెదవాగు ప్రాజెక్టు ప్రారంభించాక ఇంత పెద్దమొత్తంలో బ్యాక్ వాటర్ రావడం ఇదే మొదటిసారని సమీప గ్రామాల రైతులు చెబుతున్నారు. నారాయణపురం కట్టమైసమ్మ తల్లి ఆలయం వరకు వరదనీరు వస్తుందని, కానీ గురువారం వరద నీరు అనంతారం గ్రామాన్ని ముంచేస్తుందన్న భయంతో గ్రామస్తులు ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. పండువారిగూడెం, అనంతారం మధ్య వాగు ఉధృతంగా ప్రవహించి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కావడిగుండ్ల, గుబ్బలమంగమ్మ గుడి ప్రాంతాల నుంచి అనంతారం, బచ్చువారిగూడెం మీదుగా వాగు వచ్చి పెదవాగు ప్రాజెక్టులో చేరుతుంది. గుబ్బలమంగమ్మ గుడి వద్ద ఎంత వరదొచ్చినా.. మొత్తం వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగకపోగా బచ్చువారిగూడెం, ప్రాజెక్టు క్యాంపు, గుమ్మడవల్లి, నారాయణపురం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గుమ్మడవల్లిలోకి వరదనీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు కొత్తూరు వెళ్లిపోయారు.

అనుకున్నట్లే.. గండి

గురువారం రాత్రంతా వరద ఇదేవిధంగా కొనసాగితే ప్రాజెక్టు తెగిపోయే ప్రమాదముందని ఆందోళన చెందారు. వారి ఆందోళనకు అనుగుణంగా రాత్రి 11గంటల సమయాన కుడి కాల్వ తూము వద్ద 40 మీటర్ల మేర గండి పడింది. దీంతో వరద సుమారు నలభైకిపైగా ఇళ్లను ముంచెత్తింది.

బిక్కుబిక్కుమంటూ..

ఊహించని విధంగా పెద్దవాగు కన్నెర్ర చేయడంతో అందులో చిక్కుకున్న 28 మందికి పైప్రాణాలు పైనే పోయినంత పని అయింది. క్షణక్షణానికి పెరుగుతున్న వరద ఉధృతి, మరోవైపు అస్తమిస్తున్న సూర్యుడు.. ఈ తరుణంలో దేవుడే దిక్కు అన్నట్లుగా మారింది వారి పరిస్థితి. అయితే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చకచకా సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో రాత్రి 7 గంటల సమయానికి బాధితులు సురక్షిత ప్రాంతాలకు చేరుకుని బతుకుజీవుడా అనుకున్నారు.

అయితే, ప్రమాదాన్ని ముందే ఊహించిన అధికారులు గుమ్మడవల్లి, కొత్తూరు వాసులను పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ కళాశాలకు తరలించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కానీ 70కి పైగా గొర్రెలు, పెద్దసంఖ్యలో ఆవులు, గేదెలు వరదలో కొట్టుకు పోయాయని స్థానికుల ద్వారా తెలిసింది. కాగా, పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ఏపీ, తెలంగాణ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మంత్రులు ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికీ లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించడంతో రాత్రంతా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఎప్పుడేం జరిగిందంటే..

- పెద్దవాగుకు వరద పోటెత్తడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తాలని నిర్ణయించిన అధికారులు
- ఉదయం 11 గంటలకు మొదటి గేటు, మధ్యాహ్నం 12–30 గంటలకు రెండో గేటు ఎత్తిన అధికారులు
- ప్రాజెక్టు కట్టాక ఎన్నడూ మూడో గేట్ ఎత్తే అవసరం రాకపోయినా.. ఇప్పుడు తప్పనిసరి కావడంతో ప్రయత్నాలు
- కానీ మూడో గేట్ మొరాయిస్తుండగానే... అంతకంతకూ పెరిగిన వరద
- ఔట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో పెద్దవాగులోకి వరద ఎగపోటు
- మధ్యాహ్నం ఒంటి గంటకు నారాయణపురం – బచ్చువారిగూడెంల మధ్య లోతట్టు ప్రాంతంలోకి చేరిన వరద
- మధ్యాహ్నం 1–15 గంటలకు ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది వరదలో చిక్కుకున్నారు.
- మధ్యాహ్నం 2–30 గంటలకల్లా ఆటోలో వచ్చిన వారితో పాటు పొలాల్లో ఉన్న వారినీ చుట్టుముట్టిన వరద
- 3గంటలకు బచ్చువారిగూడెం బ్రిడ్జి సమీపంలో ఎత్తయిన ప్రాంతానికి పయనం
- 3–30 గంటల సమయానికి బాధితుల పాదాలను తాకిన నీరు
- సాయంత్రం 4 గంటలకు చెట్లు, కరెంటు స్తంభాలు ఎక్కిన బాధితులు
- 5గంటలకు చెట్లు, కరెంటు స్తంభాలు కొట్టుకుపోవడంతో బాధితుల ఆర్తనాదాలు
- 5–30 గంటలకు విశాఖ నుంచి నేవీ హెలీకాప్టర్ రాక.. వరద ప్రభావిత ప్రాంతాల్లో గాలిలో చక్కర్లు
- ల్యాండ్ అయ్యేందుకు అనువైన ప్రదేశం లేక తిరిగి వెళ్లిపోయిన హెలీకాప్టర్
- 6గంటలకు బాధితుల మోకాళ్ల వరకు చేరిన నీరు.
- 6–15 గంటలకు ఏపీ నుంచి వచ్చిన నేవీ హెలీకాప్టర్
- సాయంత్రం 6–35 గంటలకు హైదరాబాద్ నుంచి మరో హెలీకాప్టర్ రాక
- రాత్రి 7గంటలకల్ల రెండు హెలీకాప్టర్ల సిబ్బంది సమన్వయంతో ఒడ్డుకు చేరిన బాధితులు



వరద నుంచి బయటపడిన స్థానికులు, రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న నేవీ అధికారులతో ఎమ్మెల్యే ఆదినారాయణ

రెండు హెలీకాప్టర్లతో...

పెద్దవాగుకు గురువారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో అకస్మాత్తుగా వరద పెరిగి ముందుగా ఒడ్డు వెంట ఉన్న పొలాలను చుట్టుముట్టింది. దీంతో పొలాల్లో ఉన్నవారు ప్రాణాలు కాపాడుకునేందుకు చెరువుకట్టకు దగ్గరలో ఎత్తయిన ప్రదేశం వైపు వెళ్లారు. ఆ తర్వాత క్రమంగా వరద పెరుగుతూ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి బాధితుల మోకాళ్లలోతు వరకు చేరింది. దీంతో తమను కాపాడాలంటూ అప్పటికే కుటుంబసభ్యుల ద్వారా వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంతలోనే యంత్రాంగం చేరుకోగా సహాయక చర్యలపై మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయాన ఏపీలోని వేలేరుపాడు మండలం అల్లూరినగర్ దగ్గర వరద నీటిలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న ఐదుగురిని కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం నేవీ హెలీకాప్టర్‌ను పంపినా అప్పటికే స్థానికులు వారిని కాపాడారు. దీంతో నేవీ హెలీకాప్టర్ ఏలూరులో ఆగిపోయిన విషయం తెలుసుకుని ఇటు పంపించారు. ఆ హెలీకాప్టర్ ఘటనా స్థలికి 6:15 గంటలకు వచ్చింది. అప్పటికే కారుమబ్బుల కారణంగా వెలుతురు సరిగా లేదు. సహాయ కార్యక్రమాలు ఏ మేరకు జరుగుతాయో అనే సందేహం అందరిలోనూ నెలకొంది. కానీ నేవీ హెలీకాప్టర్ ముందుగా ప్రభావిత ప్రాంతంలో చక్కర్లు కొట్టి బాధితులు ఉన్న ప్రాంతాన్ని గుర్తించింది. ఆ తర్వాత 20 నిమిషాలకు తెలంగాణకు చెందిన మరో హెలీకాప్టర్ ఘటనా స్థలికి చేరుకుంది. 6:45 గంటలకు అసలైన రెస్క్యూ ఆపరేషన్ మొదలైంది. నేవీ హెలీకాప్టర్ లొకేషన్ ఆధారంగా బాధితులు ఉన్న చోటుపై లైట్ వేసింది. రెండో హెలీకాప్టర్ ఆ స్థలానికి చేరుకుని బాధితులకు రోప్ అందించింది. దీంతో విడతల వారీగా బాధితులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం అయింది. కాగా, వరదలో చిక్కుకున్న వారిని తీసుకొస్తున్న హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు సరైన స్థలం లేక నారాయణపురంలోని వైకుంఠధామంలో దించడం గమనార్హం.



గ్రామ సమీపాన ల్యాండ్ అవుతున్న హెలీకాప్టర్

ట్రాక్టర్ కోసం వెళ్లాను



పెద్దవాగు ఒడ్డు వెంట పొలం ఉండగా.. వరద వస్తుందనడంతో ట్రాక్టర్ తీసుకొద్దామని మధ్యాహ్నం 3–30 గంటలకు వెళ్లాను. అప్పటికే ట్రాక్టర్ నీటమునగడంతో వచ్చేస్తుండగా వరద పెరిగి నారాయణపురం రోడ్డును చుట్టుముట్టింది. దీంతో ఆటోలో వెళ్తున్నవారు ఆగిపోయారు. వారితో కలిసి కట్టమైసమ్మ గుడి దగ్గర మెరక ప్రాంతానికి చేరుకోగా వరద పెరుగుతూ వచ్చింది. చూస్తుండగానే చెట్లు, స్తంభాలు కూలుతుండడంతో ధైర్యం సన్నగిల్లింది. మూడు గంటలు అక్కడే ఉండగా ఫోన్‌లో ఇంట్లో వాళ్లతో మాట్లాడాను. ప్రాణాలు దక్కవనే భయం వేసినా వేసింది. సాయంత్రం హెలికాప్టర్లు చూడగానే ధైర్యం వచ్చింది. రోప్‌తో కిందకు దిగిన వ్యక్తి మమ్మల్ని ఒక్కొక్కరుగా పైకి ఎక్కించారు.

– మహేశ్, రైతు, నారాయణపురం

బైక్ వదిలి చెట్టు ఎక్కా..



వాన మధ్యాహ్నం తగ్గడంతో పెద్దవాగు ఒడ్డు వెంట ఉన్న పొలానికి బైక్‌పై వచ్చాను. పని చేస్తుండగానే వాగు పైవరకు వరద చేరింది. బయటపడదామని అనుకునేలోగా వరద చుట్టుముట్టడంతో ట్టుంది. బైక్ అక్కడే వదిలేసి దగ్గర్లో ఉన్న వేప చెట్టు ఎక్కాను. వరద ఉధృతికి బైక్ కొట్టుకుపోయింది. నేను ఉన్న చెట్టు చుట్టూ వరద చేరడంతో ఫోన్‌లో ఊర్లో వాళ్లకు సమాచారం ఇచ్చాను. మరోవైపు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న కాపాడాలని ఫోన్ చేయడంతో ఎస్సై, తహసీల్దార్, ఎంపీడీఓకు తెలిపా. నన్ను కాపాడేందుకు మా ఊరు, పక్క ఊర్ల నుంచి సుమారు వంద మంది యువకులు మోకుతాళ్ల సాయంతో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నా దగ్గరికి వచ్చి కిలోమీటరు దూరం మోస్తూ సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు.

– నిర్మల పుల్లారావు, నారాయణపురం పీఏసీఎస్ చైర్మన్

క్షణాల్లో పెరిగింది



వర్షం తగ్గిందని పొలం దగ్గరికి వెళ్లాను. అప్పటికే చాలా మంది అక్కడ పొలం పనుల్లో ఉన్నారు. వరద ప్రవాహం పెరగడంతో కొందరు తిరిగి ఇంటికి వెళ్లారు. కాసేపు ఆగి వెళ్దామన్నట్టుగా పొలం పనిలో మునిగిపోయాను. కానీ కాసేపటికే ఊహించని విధంగా వరద పెరిగి చుట్టుముట్టింది. పరుగు పరుగున కట్టమైసమ్మ గుడి దగ్గరున్న మెరక ప్రాంతానికి చేరుకున్నాను.

– చందా మల్లికార్జునరావు, రైతు, నారాయణపురం

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..



వేలేరుపాడు మండలం కోయిదా పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నా. అత్యవసర మందులు తీసుకుని ఆటోలో వెళ్తుండగా వరదలో చిక్కుకున్నా. ఆటోలో 15 మంది ఉన్నాం. మధ్యాహ్నం 1–15 గంటలకు వరదలో చిక్కుకోగానే మా ఇంట్లో వాళ్లకు, అధికారులకు సమాచారం ఇచ్చా. అంతలోనే ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు కరెంటు స్తంభాలు, మరికొందరు చెట్లు ఎక్కారు. అయితే దూరంగా వరద ప్రవాహానికి చెట్లు కొట్టుకుపోవడం, స్తంభాలు కూలిపోవడం చూసి భయమేసింది. సుమారు నాలుగు గంటల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపాం.

– అనూష, కోయిదా

పారిశుద్ధ్య చర్యలు – జాగ్రత్తలు

మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్ ఇన్



శేషాంజన్‌స్వామి



కొత్తగూడెం అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజల కు అవగాహన కల్పించేలా 'సాక్షి' చర్యలు చేపడుతోంది. ఈమేరకు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు మున్సి పాలిటీ ఆధ్వర్యాన చేపట్టే చర్యలపై కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి సందేహాలు నివృత్తి చేస్తారు.

తేదీ : 20 - 07 - 2024 శనివారం
సమయం :
ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు
98499 05882, 99497 02944

ఇల్లెందులో..



బి. యాదగిరి

ఇల్లెందు: ఇల్లెందులో కూడా పైన పేర్కొన్న సమస్యలకు ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి పలు సలహాలు, సూచనలు అందజేస్తారు.

తేదీ : 20 - 07 - 2024 శనివారం
సమయం : ఉదయం 10-30 నుంచి
11-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
98499 05883

న్యూస్‌రీల్


సుందరం.. సుమనోహరం..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కలెక్టరేట్‌లో బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బదిలీల ప్రక్రియలో భాగంగా మార్కెటింగ్, ఉపాధి కల్పన, సంక్షేమ తదితర శాఖల ఉద్యోగులు 31 మందికి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ గురువారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి శుక్రవారం ప్రొసీడింగ్స్ ఇచ్చే అవకాశందని అధికారులు తెలిపారు.

తొలిరోజు డీఎస్సీ ప్రశాంతం

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో తొలిరోజు గురువారం నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి వర్షం జోరుగా కురవడంతో అభ్యర్థులు కేంద్రానికి చేరుకునేందుకు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా ఉదయం 7.30 గంటల నుంచే అభ్యర్థులను లోపలికి అనుమతించారు. 129 మందికి గాను 112 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

వర్షంతో 21వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం

సింగరేణి(కొత్తగూడెం): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో సింగరేణి వ్యాప్తంగా గురువారం 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఇందులో కొత్తగూడెం రీజియన్‌లో 21వేల టన్ను ఉత్పత్తి నిలిచిపోయింది. ఇల్లెందు ఏరియాలో 3వేల టన్నులు, కొత్తగూడెం ఏరియాలో 8వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 10వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. వర్షంతో క్వారీలోని హాల్ రోడ్లన్నీ బురదమయం కావడంతో డంపర్లు, డోజర్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

గోదావరి దోబూచులాట

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ.. తగ్గుతూ దోబూచులాడుతోంది. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద రావడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం రాత్రి 14.5 అడుగులకు చేరింది. క్రమంగా పెరుగుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకు 18.1 అడుగులకు చేరుకుంది. బుధవారం రాత్రి మరో మూడు అడుగులు పెరిగి 22.2 అడుగులకు చేరింది. ఇక గురువారం ఉదయం మూడు అడుగులు తగ్గి 18.2 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తాం

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలు ఉంటాయని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహ అవసరం లేదని చెప్పారు. ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి తనను సంప్రదించాలని సూచించారు. సీనియారిటీ జాబితా ప్రకారం ఖాళీల వివరాలు ముందుగానే వెల్లడించామని తెలిపారు. సమావేశంలో ఏట మోహన్, పాయం శ్రీనివాసరావు, రాంప్రసాద్, ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్, వీసాల కృష్ణయ్య, ఉమాదేవి, రామ్‌చందర్, నాగరాజు, దుర్గాప్రసాద్, హరికిషన్, అజయ్ పాల్గొన్నారు.

12 మంది బదిలీ.. వచ్చింది ఒక్కరే

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది ఖాళీ

భద్రాచలం : భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రెగ్యులర్ నర్సింగ్ సిబ్బంది 17 మంది పనిచేస్తుండగా వీరిలో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న ముగ్గురికి బుధవారం నాటి కౌన్సెలింగ్‌లో బదిలీ అయింది. ఇక గురువారం మరో తొమ్మిది మందికి బదిలీ జరిగింది. కాగా ఇతర ప్రాంతాల నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రిని ఒక్కరు మాత్రమే ఎంచుకున్నారు. అంటే మొత్తం 12 మంది వెళ్తే ఒక్కరే వచ్చారు. ఆ ఒక్కరు కూడా భద్రాచలంలో ఉంటూ పాల్వంచలో పనిచేస్తున్న ఓ మహిళా నర్సు కావడం విశేషం. ఇక శుక్రవారం వైద్యులకు, శనివారం సూపరింటెండెంట్ కేడర్ ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి. ఈ కౌన్సిలింగ్‌లో సైతం ఇదే పరిస్థితి కనిపించే అవకాశాలు ఉన్నాయి.

రుణమాఫీ చారిత్రక నిర్ణయం

- ఇల్లెందు మండలం సుదిమళ్లలో ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- జిల్లాలో రూ.లక్ష లోపు రుణం ఉన్న లబ్ధిదారులు 28,018 మంది



సుదిమళ్లలో రుణమాఫీ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్/సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ చారిత్రక, ప్రతిష్టాత్మక నిర్ణయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రుణమాఫీ ప్రక్రియ ప్రారంభోత్సవం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఇల్లెందు మండలం సుదిమళ్ల రైతు వేదిక నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి, నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రైతుల రుణాలను మాఫీ చేశారని, ఈ రెండూ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో రూ.లక్ష లోపు రుణమాఫీ కింద 28,018 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. వీరందరి ఖాతాల్లో రుణమాఫీ డబ్బు జమవుతుందని చెప్పారు. ఈ పథకంపై రైతులకు ఏమైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంటాయని, రైతులు జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ (7416442798), వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ (9550226672)ను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ మండల రాము మహేష్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, పులిగళ్ల మాధవరావు, జనగం కోటేశ్వరరావు, ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల్లో రైతులు

కొత్తగూడెంఅర్బన్: రుణమాఫీ ప్రక్రియ అమలుతో రైతుల్లో ఆనందోత్సాహాలు నెల కొన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని రైతు వేదికల వద్ద గురువారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లాలో రూ.లక్ష లోపు రుణం పొందిన 28,019 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.132.07 కోట్లు జమ చేయించామని, రూ.లక్ష దాటిన వారికి రెండో విడతలో మాఫీ ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారులు వెల్లడించారు. రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతుల్లో అక్కడక్కడ సాంకేతిక సమస్యలు ఉన్నచోట మినహా అందరి ఖాతాల్లోనూ నగదు జమ చేశామని పేర్కొన్నారు. మొదటి విడతలో అశ్వారావుపేట నియోజకవర్గంలో 7,366 మంది రైతులకు, భద్రాచలం నియోజకవర్గంలో 4,345, కొత్తగూడెంలో 3,327, పినపాకలో 7, 852, ఇల్లెందులో 3,602, వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో 1,526 మంది రైతులకు లబ్ధి చేకూరిందని వివరించారు.

సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

చండ్రుగొండ : ప్రజా సంక్షేమంపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన చండ్రుగొండ మండలంలో పర్యటించారు. దామరచర్లలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. ఆ తర్వాత సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ అలుగు గండికి తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదనలు చేయాలని నీటిపారుదల శాఖాధికారులకు ఆయన సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బీ అశోక్ ఉన్నారు.

క్లుప్తంగా

పారదర్శకంగా జీసీసీ ఉద్యోగుల బదిలీలు

భద్రాచలం: గిరిజన ప్రైమరీ కోపరేటివ్ సొసైటీ (జీసీసీ)ల్లో విధులు నిర్వర్తిస్తున్న సేల్స్‌మేన్లు, ఎంసీడబ్ల్యూ వర్కర్లు, డ్రైవర్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా బదిలీ చేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జీసీసీ అధికారులు, సేల్స్‌మెన్ కమిటీ సభ్యుల సమక్షాన గురువారం ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ చేపట్టగా పీఓ పర్యవేక్షించి మాట్లాడారు. జీసీసీ పరిధిలో 25 మందిని బదిలీ చేయగా, 18 మంది సేల్స్‌మెన్లు, ఐదుగురు ఎంసీడబ్ల్యూ వర్కర్లు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ ఇన్‌చార్జ్ దావీదు, మేనేజర్లు లక్ష్మాజీ, నరసింహారావు, ఉద్యోగులు దీప్‌లాల్, భూషయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఉద్యోగులకు ఏజీ ఎం పర్సనల్(వెల్ఫేర్) కె.శ్రీనివాసరావు సూచించారు. సంస్థలో పనిచేసి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు గురువారం ఆయన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. ఉద్యోగులు సుశీల్‌కుమార్, కిరణ్‌కుమార్, టి. శ్రీనివాసరావు, శ్యాంకిరణ్, సాయి స్వప్నిల్, నాయకులు రమణమూర్తి, పీతాంబరం పాల్గొన్నారు.

నేడు గిరిజన హస్తకళల ఉత్పత్తుల మేళా

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన భవనంలో శుక్రవారం గిరిజన హస్తకళల ఉత్పత్తుల మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైఫెడ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో గిరిజనులు రూపొందించిన అటవీ, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాక ఇక్కడ ఎంపిక చేసే ఉత్పత్తులకు ట్రైఫెడ్ ద్వారా దేశవ్యాప్తంగా 120కేంద్రాల్లో విక్రయానికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అటవీశాఖ అధికారుల బదిలీ

పాల్వంచరూరల్: అటవీశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం వరంగల్‌లోని సీసీఎఫ్ భీమానాయక్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలో 13 మంది బీట్ ఆఫీసర్లువిధులు నిర్వర్తిస్తుండగా, నిబంధనల ప్రకారం 8 మందిని బదిలీ చేశారు. సంపత్‌నగర్, మర్కోడు, బంగారుచెలక ప్రాంతాల డిప్యూటీ రేంజర్లకు కూడా స్థాన చలనం కలిగించారు. టెరిటోరియల్ అటవీడివిజన్ పరిధిలో మొత్తం 15 మంది సెక్షన్ ఆఫీసర్లు విధులు నిర్వర్తిస్తుండగా, ఐదుగురు బదిలీ అయ్యారని ఆయా డివిజన్ల ఎఫ్‌డీఓలు తెలిపారు.

58 మంది సెక్షన్ ఆఫీసర్ల బదిలీ

చుంచుపల్లి: భద్రాద్రి అటవీ సర్కిల్ పరిధిలో మొత్తం 58 మంది సెక్షన్ ఆఫీసర్లను గురువారం బదిలీ చేశారు. మరో 27 మంది డీఆర్ఓలకు ఈ బదిలీల్లో అవకాశం కల్పించారు.

సింగరేణిలో కార్మికుడికి గాయాలు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో ఓ సూపర్ వైజర్ ప్రమాదవశాత్తు గురువారం గాయపడ్డాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సూరజ్ అనే వ్యక్తి ఎస్ఎంఎస్ ప్రైవేటు సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. భూగర్భ గనిలో గురువారం మొదటి షిఫ్ట్ ముగింపు సమయంలో కార్మికులు రూఫ్ బోల్టింగ్ మిషన్‌తో పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పక్కనే పనులను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్‌కు బోల్ట్ తగిలి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిసింది. కాగా త్రుటిలో ప్రమాదం తప్పినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

వాగుల్లో వరద ఉధృతి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనేకచోట్ల రహదారులపై వరద నీరు ప్రవహించి, రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట–భద్రాచలం ప్రధాన మార్గం జలమయం కావడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలకు నేల నాని పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లోకి వరద నీరు చేరింది. –సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: వినాయకపురం పార్కు వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు


అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట–భద్రాచలం మార్గంలో రోడ్డుపై చేరిన వరద నీరు


అశ్వాపురం: తుమ్మలచెరువు–వెంకటాపురం గ్రామాల మధ్య లోతువాగు వద్ద పోలీసుల పహారా


ములకలపల్లి: కొబ్బరిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాములేరు వాగు


ములకలపల్లి: ముత్యాలంపాడు శివారులో కోతకు గురైన రోడ్డు


అశ్వారావుపేటరూరల్: మొద్దులగూడెం మార్గంలో వరద ప్రవాహం


గుండాల: ఆళ్లపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు

ఆపదలో రక్షించుకోవడం ఇలా...

బూర్గంపాడు: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఆపద నుంచి బయటపడే మార్గాలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ప్రతినిధులు అవగాహన కల్పించారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ప్రతినిధులు గోదావరి వరదల సమయంలో ప్రాణరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న వస్తువులతో వరద నుంచి బయటపడే మార్గాలను తెలిపారు. పిడుగుపాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ఆ తర్వాత జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కేడెట్లతో మాక్ డ్రిల్ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎస్సై రాజేష్, ప్రిన్సిపాల్ చీన్యా తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్ కేడెట్లతో మాక్‌డ్రిల్ చేయిస్తున్న అధికారులు

ప్రజారాజ్యం స్థాపనే లక్ష్యం..

ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు దండా లింగయ్య

ఇల్లెందు: దేశంలో పీడిత ప్రజల రాజ్యస్థాపనే లక్ష్యంగా యూసీసీఆర్ఐ(ఎంఎల్), ఓపీడీఆర్ పోరాడుతోందని ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు దండా లింగయ్య తెలిపారు. విప్లవ, ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఇల్లెందులో గురువారం గ్రామీణ పేదల సంఘం(యూసీసీఆర్–ఎంఎల్), ఓపీడీఆర్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభలో లింగయ్య మాట్లాడారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినా కొందరు అతివాద, మితవాద, అవకాశవాద వైఖరి కారణంగా పార్లమెంట్ పంథాలోకి వెళ్లి ప్రజా సమస్యలు గాలికొదిలేశారని విమర్శించారు. కాగా, విప్లవోద్యమ రథసారథులు డీవీ, టీఎన్ బాటలో పయనిస్తూ ఐక్య పోరాటాలు నిర్వహిస్తే పీడిత ప్రజల రాజ్యం ఏర్పడుతుందని తెలిపారు. కాగా, భూస్వాముల ఆధీనంలో లక్షల ఎకరాలు ఉండగా.. సెంట్ భూమి లేని పేదలను ఆదుకోవడంలో పాలకులు విఫలమైన నేపథ్యాన వారి తరఫున తాము పోరాడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు చొప్పదండి బాలకృష్ణ, పోలెబోయిన ముత్తయ్య, షేక్ సోందుమియా, వేప వెంకన్న, కల్తీ లెనిన్, వేప వెంకన్న పాల్గొనగా, నవోదయ సాంస్కృతిక సంస్థ కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.


దేవులపల్లి, నాగిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు జాబ్‌మేళా

కొత్తగూడెంఅర్బన్: హనుమకొండ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించే అప్రెంటిస్ షిప్, జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి బి.సులోచన రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది, అంతకు ముందు సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఉదయం పారామెడికల్ విద్యార్థులు, మధ్యాహ్నం ఇతర కోర్సుల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

'ఉపాధ్యాయ' అవార్డుల దరఖాస్తు గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తు గడువు పెంచినట్లు డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, అటమిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. అప్‌లోడ్ చేసిన వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 22వ తేదీలోగా అందజేయాలని కోరారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: ఫిబ్రవరి నెలలో జరిగిన టీచర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవారికి శుక్రవారం నుంచి డీఈఓ కార్యాలయంలో ధ్రువపత్రాలు పంపిణీ చేయనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, హాల్ టికెట్లు చూపించి సర్టిఫికెట్లు పొందాలని పేర్కొన్నారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సుల వారే రావాలని, వివరాలకు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావును 99890 27943 నంబరులో సంప్రదించాలని వివరించారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

రూ.4 లక్షల జరిమానా

మణుగూరు టౌన్: చెక్‌బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.4లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కంభపు సూరిరెడ్డి గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2020లో మణుగూరుకు చెందిన కోటా కాంతయ్య రిటైర్డ్ సింగరేణి కార్మికుడైన పోతరాజు కృష్ణమూర్తికి రూ.4 లక్షల రుణం ఇచ్చాడు. అప్పు చెల్లించాలని కోరగా కృష్ణమూర్తి చెక్కు ఇచ్చాడు. చెక్కు తీసుకెళ్లి బ్యాంక్‌లో జమ చేయగా, బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కాంతయ్య కోర్టులో కేసు దాఖలు చేయగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి.. పోతురాజు కృష్ణమూర్తికి రూ. 4 లక్షల జరిమానా విధించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాదిదారుని తరుపున న్యాయవాదులు ఎస్‌వీ రమణారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, సీహెచ్ గురుమూర్తి వాదించారు.

పోడు హక్కు పత్రాలు ఇవ్వాలి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోడు భూముల సాగు చేస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలందరికీ హక్కు పత్రాలు, రైతుభరోసా, రుణమాఫీ ఇవ్వాలని, వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధానకార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పోడు భూముల సాగుదారుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు, యలమంచిలి వంశీ, నాగేశ్వరావుల అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 83,34 మంది 2,97,410 ఎకరాల్లో సాగుచేస్తున్న భూములకు హక్కుపత్రాల కోసం దరఖాస్తు చేస్తే 21,578 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం పోడు సాగుదారులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పోడు సాగుదారులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలన్నారు. పోడు రైతులను ఇబ్బంది పెడితే అల్లూరి సీతారామరాజు వారసులుగా మారి తిరగబడతారని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇవ్వగా, తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, నాయకులు దొడ్డ రవికుమార్, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, గడ్డం స్వామి, కొండబోయిన వెంకటేశ్వర్లు, వాంకుడోత్ కోబల్, ఆలేటి కిరణ్, బత్తుల వెంకటేశ్వర్లు, కొమరం కాంతారావు, మచ్చా రామారావు, ఈసం నర్సింహారావు, యాసా నరేష్, జంగిలి వెంకటరత్నం, వినోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడికెళ్లినా బతికేవారేమో..

- పిడుగుపాటుతో పిల్లల మృతి.. రైతు కుటుంబంలో విషాదం
- కళ్ల ముందే కుమారులు చనిపోవడంతో కన్నీరుమున్నీరు


చందు (ఫైల్)


కుమారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లి

దమ్మపేట: సాధారణ రైతు కుటుంబం.. ఉమ్మడి నలుగురు అన్నదమ్ములు కలిసి వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో ఓ కుటుంబం గురువారం వ్యవసాయ పనులకు వెళ్లిన సమయాన పిడుగు పడడంతో వారి ఇద్దరు కుమారులు మృతి చెందడం తీరని విషాదాన్ని మిగిల్చింది. ఒక కుమారుడు గతంలో బడి మానేయగా, ఇటీవల బడిబాటలో ఉపాధ్యాయులు వెళ్లి పాఠశాలకు రావాలని నచ్చచెప్పారు. మరో కుమారుడిని వర్షం కారణంగా స్కూల్‌కు పంపకుండా పొలానికి తీసుకెళ్లిన సమయాన ఈ ప్రమాదం జరిగింది. దీంతో పిల్లలిద్దరూ బడికి వెళ్లినా బతికేవారంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

వర్షంతో పొలం పనులకు...

దమ్మపేట మండలం జమేదారుబంజర గ్రామానికి చెందిన బొర్రా మల్లేష్ – నాగమణి దంపతులకు కుమారులు చందు(14), సిద్దు(11) ఉన్నారు. వీరిలో చందు ఆరో తరగతి పూర్తయ్యాక చదువు మానేశాడు. చిన్నకుమారుడు సిద్దు గ్రామంలో మూడో తరగతి చదువుతున్నాడు. మల్లేశ్ దంపతులు వారసత్వంగా వచ్చిన భూమిని అన్నదమ్ములతో కలిసి సాగు చేస్తూ ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇంట్లో నివాసముంటున్నారు. కాగా, బుధవారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తుండటంతో చిన్న కుమారుడు సిద్దు పాఠశాలకు వెళ్లలేదు. దీంతో కుమారులిద్దరిని తీసుకుని మల్లేష్ దంపతులు గ్రామ శివారు పాతచెరువు సమీపాన పొలం వద్దకు వెళ్లారు. తల్లిదండ్రులు పొలం పనుల్లో నిమగ్నం కాగా.. పిల్లలు కొద్దిదూరాన ఉన్నారు. ఈ సమయంలో పిల్లలు ఉన్న చోటకు సమీపాన భారీ శబ్దంతో పిడుగుపడింది. దీంతో తల్లిదండ్రులు వెళ్లే సరికే చందు, సిద్దు తీవ్రగాయాలతో విగతజీవులుగా పడి ఉన్నారు. దీంతో అంతసేపు తమ కళ్ల ముందే ఉన్న కుమారులు కన్నుమూయడంతో మల్లేశ్ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఇదే ఘటనలో అక్కడ వ్యవసాయ పనులు చేస్తున్న గడ్డం దుర్గ, సున్నం తిరుపతిరావు సైతం గాయపడి నడవలేని స్థితికి చేరగా ఆశా వర్కర్ శారదతో ప్రాథమిక చికిత్స చేయించి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

108 అంబులెన్స్‌లో ఇద్దరి ప్రసవం


రాంనగర్ వద్ద 108లో ప్రసవించిన కౌసల్య

రఘునాథపాలెం/అశ్వాపురం: ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రసవం కోసం తరలిస్తున్న గర్భిణులకు మార్గమధ్యలోనే నొప్పులు పెరగడంతో 108 సిబ్బంది పురుడు పోసి అభినందనలు అందుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడికి చెందిన నిండు గర్భిణి తోటపల్లి అనూష పురిటినొప్పులతో బాధపడుతోందని బుధవారం అర్ధరాత్రి సమాచారం అందడంతో 108 ఈఎంటీ తుమ్మ జగదీష్, పైలట్ కుంచం మహేష్ జోరువానలో గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి అనూష, ఆమె భర్త ప్రవీణ్, అత్త హైమావతి, ఆశ కార్యకర్త మేడె శ్రీలక్ష్మిని తీసుకుని ఖమ్మం వస్తుండగా ఆమెకు నొప్పులు పెరగడంతో గ్రామం దాటాక అర్ధరాత్రి రాత్రి 1–45 గంటలకు రహదారి పక్కన వాహనాన్ని ఆపి సాధారణ ప్రసవం చేయడంతో అనూష మూడో కాన్పులో మగబిడ్డను జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను ఖమ్మం ఎంసీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఈఎంటీ, పైలట్‌ను 108 ఎగ్జిక్యూటివ్ మేనేజర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రోగాం మేనేజర్ భూమా నాగేందర్ అభినందించారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బట్టీలగుంపు గ్రామపంచాయతీ పరిధి మారుమూల గ్రామమైన రాంనగర్‌కు చెందిన కౌసల్య గురువారం 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పులు వస్తుండగా కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారంతో సిబ్బంది చేరుకుని ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. అయితే, మార్గమధ్యలోనే కౌస్యలకు నొప్పులు పెరగడంతో వాహనంలో ఈఎంటీ సుజాత, ఆశావర్కర్ శోభారాణి ఆమె ప్రసవం చేయగా.. తల్లీబిడ్డలను అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు.

ఉద్యమనేత ఇకలేరు..

మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు 'రాయల' మృతి

- రైలుకింద పడడంతో కన్నుమూసిన చంద్రశేఖర్
- విప్లవోద్యమంలో రహస్య కార్యకర్తగా పనిచేసిన నేత


రాయల చంద్రశేఖర్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: విద్యార్థి దశ నుంచే ఉద్యమబాట పట్టి.. తుదికంటా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మృతి చెందారు. ఆయన మంగళవారం రాత్రి ఖమ్మంలో రైలు కింద పడి మృతి చెందగా.. మృతదేహం ఛిద్రం కావడంతో గుర్తించడం ఆలస్యమైంది. ఆయన కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా బుధవారం రాత్రి కుటుంబీకులు అనుమానంతో జీఆర్పీ సిబ్బందిని సంప్రదించి మార్చురీలో పరిశీలించగా రాయల మృతి చెందినట్లు తేలింది. ఈ నేపథ్యాన సహచరులు, వివిధ పార్టీల నాయకులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

విద్యార్థి దశ నుంచే విప్లవబాట..

చంద్రశేఖర్ విద్యార్థిదశలో విప్లవోద్యమంలోకి వచ్చారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకుడిగా విద్యార్థి సంఘం ప్యానల్‌లో జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1975లో విప్లవోద్యమంలో రహస్య కార్యకర్తగా పనిచేశారు. మణుగూరు, అశ్వాపురం, సత్తుపల్లి ప్రాంత దళాల్లో పనిచేసిన ఆయన ఆయన అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత రైతు కూలీ సంఘం నాయకుడిగా ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఇల్లందు ప్రాంతాల్లో ఉద్యమ నిర్మాణం చేశారు. పార్టీ పత్రికను కూడా నిర్వహించారు. హైదరాబాద్‌లో కూడా కొంత కాలం తన కార్యకలాపాలు నిర్వహించారు. ఏపీ రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన కొన్నాళ్లు రైతాంగ ఉద్యమ సంయుక్త కిసాన్‌మోర్చా ఆలిండియా జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. ఇక తన సోదరుడైన రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) అనుచరుడిగా చంద్రశేఖర్ ప్రజాపంథా రాజకీయాలను అనుసరించాడు. మితవాద, అతివాద ధోరణులను, అవకాశవాద ధోరణులను వ్యతిరేకించాడు. ఇల్లెందు ఏరియాలో ప్రజాప్రతిఘటన, ఇతర గ్రూపులు చేస్తున్న దాడులను తిప్పికొట్ట డానికి పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఇల్లెందు దళాల ఏరియా పొలిటికల్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

నివాళులు అర్పించిన నేతలు

పోస్టుమార్టం అనంతరం చంద్రశేఖర్ మృతదేహాన్ని గురువారం ఖమ్మంలోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయానికి తరలించగా పలువురు నివాళులర్పించారు. మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, కెచ్చెల రంగయ్య, కే.జీ.రామచందర్, కె.రమ, ఎంపీలు రేణుకాచౌదరి, రామసహాయం రఘురాంరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పెద్ద చంద్రన్న, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సాధినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, తిరుమలరావు నివాళులర్పించి మాట్లాడారు. అలాగే, రాయల మృతిపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంతాపం ప్రకటించగా, మాస్‌లైన్ జాతీయ కమిటీ సంతాప సందేశాన్ని పంపింది. ఈ సందర్భంగా సంతాపసభలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ విద్యార్థి దశలోనే విప్లవోద్యమంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఉద్యమ క్రమంలో చంద్రశేఖర్ అనేక సమస్యలు ఎదురైనా దృఢంగా నిలబడ్డారని, నమ్మిన ప్రజాపంథా రాజకీయాల వెనుకే కొనసాగారని కొనియాడారు. కాగా, రాయల స్వగ్రామమైన తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో అంత్యక్రియలు నిర్వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు బెల్లం శ్రీనివాస్ కే.జీ.రాంచందర్, కెచ్చెల రంగయ్య, కె.రమ, గోకినపల్లి వెంకటేశ్వర్లు, సాధినేని వేంకటేశ్వరరావు, పోటు సూర్యం, వేములపల్లి వెంకటరామయ్య, గోవర్ధన్ మధు, సంధ్య, ఝాన్సీ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సాకేత్ (ఫైల్)

కరకగూడెం: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనంతారం గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన ఇర్ప సాకేత్ (20) గురువారం మొగిలితోగు గ్రామ సమీపంలోని ఓ రైతుకు సంబంధించిన వరి పొలంలో మరో ఇద్దరు వ్యక్తులతో వెళ్లి మోటార్ తీగలను జాయింట్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా కరకగూడెం ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపారు. మృతదేహాన్ని మణుగూరు ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పాల్వంచరూరల్: జోరువానలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ముగ్గురు గాయపడ్డ సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని తెనాలికి చెందిన తుమ్మలపాటి పవన్, ఆయన భార్య రమణమ్మ, డ్రైవర్ గోపి మరో ముగ్గురు కలిసి భద్రాచలం వెళ్తున్నారు. మండల పరిధిలోని కేశవాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో పవన్, రమణమ్మ, గోపి గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.